

సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

## సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి : ఏఎస్పీ

వేములవాడ, సెప్టెంబర్ 29 : సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. వేములవాడ పట్టణంలోని స్థానిక ఫంక్షన్ హాల్లో పట్టణ పరిధిలోని హాస్పిటల్స్ యాజమాన్యంతో వేములవా పట్టణ పరిధిలో సీసీ కెమెరా ఏర్పాటుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సీసీ కెమెరాలతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమరాలు ఉండడంపై నేరస్తులు నేరం చేయడానికి ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారన్నారు. గ్రామాల్లో సీసీ కెమరాలు మరింత భద్రత కల్పిస్తాయని, ఈ మధ్య కాలంలో కెమెరాల ద్వారా చాలా కేసులు చేధించడం జరిగిందని తెలిపారు. సీసీ కెమరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన హాస్పిటల్స్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ వెంట పట్టణ సీఐ వీరప్రసాద్,డాక్టర్లు ఉన్నారు.

## నేడు రాజన్న గోశాలలోని కోడెలు, ఆవుల ఉచిత పంపిణీ

వేములవాడ టౌన్,సెప్టెంబర్ 29 : వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో నేడు సోమవారం ఉదయం రాజన్న భక్తులు స్వామివారికి సమర్పించిన కోడెలను, ఆవులను రైతులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో అందజేయనున్నారు. ఈ కోడెలు, ఆవులను అర్హులైన హిందూ రైతులకు అందజేయనున్నట్లు ఆలయ గోశాల ఇన్‌చార్జి ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30కు తిప్పాపురంలోని రాజన్న ఆలయ గోశాలలో పంపిణీ ఉంటుందని వెల్లడించారు.

## తగ్గిన ఇన్‌ఫ్లో.. గేట్లు మూసివేత

తిమ్మాపూర్, సెప్టెంబర్ 29: లోయర్ మానేరు గేట్లను అధికారులు మూసివేశారు. మిడ్ మానేరు నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో శనివారం సాయంత్రం రెండు గేట్లు ఓపెన్ చేసి 5వేల క్యూసెక్కుల నీళ్లను మానేరు వాగుకు వదిలగా, పైనుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఆదివారం ఉదయం 10.30 గంటలకు మూసివేశారు. 24 టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీలో ప్రస్తుతం పూర్తిస్థాయి నీళ్లు ఉన్నాయి. మిడ్‌మానేరు నుంచి 5 వేల క్యూసెక్కులు వస్తుండగా.. కాకతీయ కాలువ ద్వారా 4500 క్యూసెక్కులు వదులుతున్నారు.

## రుణమాఫీ అమలులో సర్కారు ఫెయిల్

వీణవంక, సెప్టెంబర్ 29 : రైతు భరోసా అందించక పోవడంతోపాటు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా ఫెయిల్ అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా ఆయన మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ విషయంలో రైతన్నలను రేవంత్ ప్రభుత్వం గోసపెడుతందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దాటవేస్తూ కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, కన్వీనర్ నరసింహరాజు పాల్గొన్నారు.

## ముకాస కార్యవర్గం ఎన్నిక

విద్యానగర్, సెప్టెంబర్ 29 : నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో ఆదివారం మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్ ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా ఆకుల ప్రకాశ్, అధ్యక్షుడిగా నలువాల రాజేందర్, కార్యదర్శిగా తోట రాజేందర్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా గుండ సతశ్, జాయింట్ సెక్రెటరీగా కొనగాలి నర్సింగ్, సలహాదారులుగా ఆకుల సుదర్శన్, దిండిగాల మధు, సభ్యులుగా చల్ల జనార్దన్, గుర్రాల శ్రీనివాస్, నర్మాల పరంధాము, కోల శ్రీనివాస్, జేవీ రమణ ఎన్నికయ్యారు.

# గేట్లు తెరుస్తున్నట్టు ప్రకటించినా..!

- మానేరు వాగులోకి ఇసుక మాఫియా
- నీటిలో మునిగిన ట్రాక్టర్లు

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 29 : ఓ వైపు లోయర్ మానేరు డ్యామ్ గేట్లు ఎత్తేందుకు అధికారులు ముందస్తుగానే సమాచారం అందించి నీటిని వదిలినా.. ఇసుక మాఫియా అక్రమ రవాణా మాత్రం ఆపడం లేదు. మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ శివారులో శనివారం రాత్రి దాదాపు ఎనిమిది గంటల ప్రాంతంలో ఇసుక తరలించేందుకు ఓ ముగ్గురు ట్రాక్టర్లను తీసుకుని మానేరు వాగులోకి వెళ్లారు. ఇసుక నింపి తీసుకొచ్చే క్రమంలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో ట్రాక్టర్లను అక్కడే వదిలేసి ఒడ్డుకు చేరారు. ఆదివారం గేట్లు మూసేయడంతో నేషనల్ హైవే పనుల్లో ఉన్న ఓ భారీ క్రేన్ సాయంతో నీటిలో మునిగిన ఒక ట్రాక్టర్‌ను బయటకు తీశారు. మరో ప్రాంతంలో ఉండిపోయిన మరో ట్రాక్టర్‌ను చిన్నపాటి రిపేర్ చేసి తీసుకొచ్చారు. ఇంకొక ట్రాక్టర్ నీటి ప్రవాహంలోనే ఉండిపోయినట్లు స్థానికులు తెలిపారు. అయితే, ఇసుక మాఫియా రాజ్యమేలుతున్నా అధికారుల పట్టింపు కరువైందని స్థానికులు వాపోతున్నారు.



వాగులోనే చిక్కిపోయిన ట్రాక్టర్



ప్రవాహంలోనే బోల్తాపడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న క్రేన్

# తనకు తానే గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి రజినిశ్రీ

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్
- రజిని శ్రీ పురస్కారం ప్రదానం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 29 : సామాజిక మాధ్యమాలు లేని సమయంలో తనకు తానే గుర్తింపు సాధించుకున్న వ్యక్తి రజినిశ్రీ అని, ఒక కొడుకుగా ఆయన పేరుతో పురస్కారం అందజేయడం ఒక వరంగా భావిస్తున్నానని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. స్థానిక ఫిలింభవన్‌లో జాతీయ సాహిత్య పరిషత్, కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రజినిశ్రీ నవలా పురస్కార ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సాహితీవేత్తలను, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో సాహిత్య కళ, విద్య, క్రీడా రంగాల్లో సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసిన తన తండ్రి గాజుల రజినిశ్రీ పేరు మీద ఏటా సాహిత్య పురస్కారం అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి నవల విభాగంలో చుండూరు సీత రచించిన 'సారంగి' నవలకు రజనిశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. రచయిత్రి చండూరు సీతకు రూ.10,116 నగదు బహుమతి, మెమెంటో అందజేసి, శాలువాతో సత్కరించారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ సభాధ్యక్షత వహించి, సారంగి నవలను పరిచయం చేశారు. ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో రజినిశ్రీ సతీమణి గాజుల సత్యవతి, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, డాక్టర్ పొన్నం రవిచంద్ర, అన్నవరం దేవేందర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యుడు స్తంభంకాడి గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, గంగుల శ్రీకర్, అనంతోజు పద్మశ్రీ, నీలగిరి అనిత, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



చండూరు సీతకు పురస్కారం అందజేస్తున్న శ్యాంప్రసాద్‌లాల్ కుటుంబ సభ్యులు

## 'ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడంలో విఫలం'

కలెక్టరేట్, సెప్టెంబర్ 29 : 65 ఏండ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను రెండు నెలల క్రితమే తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం, వారికి ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడంలో ఘోరంగా విఫలమైందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు శారదాదేవి విమర్శించారు. ఆదివారం నగరంలోని భగత్‌నగర్‌లో గల ఆ సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ విరమణ ప్రయోజనాల ఉత్తర్వులు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వేతనాలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాల్లో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మంజుల, వాణి, సభ్యులు వినీల, శ్యామల, అరుణ, జయశ్రీ, అనిత, వెంకటమ్మతో పాటు పలు మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# చేపల బోటులో వెళ్లి..

- ఊరచెరువులో నీట మునిగిన ఐదుగురు యువకులు
- ఒకరు మృతి.. నలుగురు క్షేమం



నరేందర్(ఫైల్)

చిగురుమామిడి, సెప్టెంబర్ 29 : చేపల బోటులో ఊర చెరువులోకి వెళ్లిన ఐదుగురు యువకులు నీట మునిగారు. ఇందులో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు క్షేమంగా బయటపడ్డారు. చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చిన్న ముల్కనూర్‌కు చెందిన కయ్యం నరేందర్(18) తన నలుగురు స్నేహితులైన పెసరి సాయి, జాగిరి శివ, కయ్యం అజయ్, మల్యాల నాగరాజుతో కలిసి ఆదివారం చేపల బోటులో ఊర చెరువులోకి వెళ్లారు. అయితే, బోటు అదుపుతప్పి బోల్తా పడడంతో ఐదుగురు నీట మునిగారు. నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరగా, నరేందర్ నీటిలో మునిగాడు. గ్రామస్తులు గమనించి నరేందర్‌ను బయటకు తీసి దవాఖానకు తరలించేలోగా మృతిచెందాడు. తండ్రి మల్లయ్య పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఇప్పుడు నరేందర్ మరణించడంతో అతని తల్లి సరవ్వ గుండెలవిసేలా రోదించింది. నరేందర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని చిగురుమామిడి ఎస్ఐ బండి రాజేశ్ సందర్శించారు.

## పద్మశాలీలు చట్టసభల్లో రాణించాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 29 : పద్మశాలీలు చట్టసభల్లో రాణించాలని పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌లాల్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ సూచించారు. నగరంలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో అదివారం పద్మశాలీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఉద్యోగులకు పద్మకుల రత్న పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టంతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పద్మశాలీలు అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకుల మెతుకు సత్యం, వాసాల రమేశ్, సురేందర్, పోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 5 నుంచి గద్దర్ స్మారక క్రికెట్ టోర్నీ

మానకొండూర్, సెప్టెంబర్ 29 : మానకొండూర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5 నుంచి మండల కేంద్రంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ స్మారక జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు యూత్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల సుధీర్‌కుమార్, ఉండింటి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్నిస్‌బాల్‌తో మ్యాచ్ నిర్వహణ ఉంటుదన్నారు. పూర్తి వివరాలకు ఫోన్‌నెం 96666 62832, 89777 79959, 79890 90872, 81067 61985, 95155 36636, 63033 70639లో సంప్రదించాలని సూచించారు.

## సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వతరెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 29 : ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తూ జీవో 25ను అమలు చేయాలని ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని, ఆ తర్వాతే సర్దుబాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏం పర్వతరెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద విద్యానికేతన్‌లో జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా ఎస్‌టీయూ కార్యకర్తల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ సర్వీస్‌కు సంబంధించిన లీవ్ రూల్స్, పెన్షన్ రూల్స్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇక్కడ ఎస్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 29: నగరంలో ఎక్కడ డ్రైనేజీల సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. ఆదివారం నగరంలోని 28, 35, 55వ డివిజన్లలో పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనుల కోసం వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా డ్రైనేజీల్లో చెత్తాచెందారం పేరుకుపోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జితేందర్, నాంపల్లి శ్రీనివాస్, నగర పాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయంలోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్టు తేలింది.

# ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

**ప్రస్తుతం** ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్సనుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.



ఎంచుకోండిలా..

**యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

**జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

**ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

**యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

**జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్**లో సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

### ఇవి గుర్తుంచుకోండి..

**యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.**

**అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.**

**వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.**

**నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.**

**పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.**

**కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.**

**ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పుడే అన్ని చూసుకొని నిర్ణయం తీసుకోవాలి.**

# చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి



మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?

త్వరపడండి.. మరో 6 నెలలే సమయం

**మీరు** ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్టైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

### ఏమిటి ఈ పథకం?

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

### ప్రధాన ఫీచర్లు..

**వార్షిక వడ్డీరేటు:** 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

**అర్హత:** మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

**కాలపరిమితి:** రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

**పెట్టుబడి:** కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

### ఏమిటి దీని ప్రత్యేకత?

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

### ఎలా పెట్టుబడి పెట్టాలి?

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ధరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జీరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

| డిపాజిట్ | వడ్డీ ఆదాయం | చివరకు వచ్చే మొత్తం |
|---|---|---|
| ₹ 1,000 | ₹ 160 | ₹ 1,160 |
| ₹ 2,000 | ₹ 320 | ₹ 2,320 |
| ₹ 3,000 | ₹ 481 | ₹ 3,481 |
| ₹ 5,000 | ₹ 801 | ₹ 5,801 |
| ₹ 10,000 | ₹ 1,602 | ₹ 11,602 |
| ₹ 20,000 | ₹ 3,204 | ₹ 23,204 |
| ₹ 30,000 | ₹ 4,807 | ₹ 34,807 |
| ₹ 50,000 | ₹ 8,011 | ₹ 58,011 |
| ₹ 1,00,000 | ₹ 16,022 | ₹ 1,16,022 |
| ₹ 1,50,000 | ₹ 24,033 | ₹ 1,74,033 |
| ₹ 2,00,000 | ₹ 32,044 | ₹ 2,32,044 |

# చదువు కోసం మదుపు..


**నేడు** పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

### ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టే పెట్టుబడులు ఈక్విటీల్లోకి వెళ్తాయి. చిన్న మదుపరులకూ ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఈ పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయన్నది గుర్తుంచుకోవాలి.

### ఎడ్యుకేషనల్ స్కీములు

వివిధ మ్యూచువల్ ఫండ్స్.. పిల్లల విద్యకయ్యే ఖర్చుల కోసం రకరకాల పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈక్విటీ, డెట్ లేదా బంగారంపై పెట్టుబడులు పెడుతూ ఆకర్షణీయ రాబడులను పొందవచ్చు.



### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లతో పోల్చితే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) తక్కువ రాబడులనే అందిస్తాయి. కానీ ఇవి సురక్షితమైనవి, నిర్దేశిత రాబడులనూ అందుకోవచ్చు.

### విద్యా రుణాలు

ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు విద్యా రుణాలనూ తీసుకోవచ్చు. ఇతర రుణాలతో పోల్చితే వీటికి కొన్ని వెసులుబాట్లుంటాయి. మారటోరియం పీరియడ్ ఉంటుంది. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రుణ చెల్లింపులను ప్రారంభించుకోవచ్చు. పాత పన్ను విధానం కింద ఐటీ చట్టంలోని సెక్షన్ 80ఈతో పన్ను మినహాయింపూ లభిస్తుంది.




# ఆటుపోట్లకు ఆస్కారం!

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో రికార్డ్ రన్ కొనసాగుతున్నది. మునుపెన్నడూలేని గరిష్ఠాల్లో సూచీలు కదలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడుల దిశగానే పోతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో ఎక్కువ రోజులు ఈక్విటీ మార్కెట్లు లాభాల్లోనే నడిచాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు లేదా 1.21 శాతం పెరిగి 85,571.85 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 388 పాయింట్లు లేదా 1.50 శాతం పుంజుకొని 26,178.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మార్కెట్లు నష్టపోవడం ఇందుకు సంకేతంగా తీసుకోవచ్చని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉండటం వల్ల సెల్లింగ్ ప్రెషర్ ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26,400-26,600 మధ్యకు వెళ్లవచ్చు.

### చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.